క్లుప్తంగా

నేడు హోం మంత్రి వనిత పర్యటన ఇలా..

కొవ్వూరు: రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కల్యాణమస్తు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు ఔరంగాబాద్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

మద్దతు ధరకే తడిసిన ధాన్యం కొనుగోళ్లు


కమల్‌రాజ్, ఏవో నల్లజర్ల మండలం

నల్లజర్ల: అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేిందని మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్ వెల్లడించారు. రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుత రబీలో మండలంలో 4,583 ఎకరాల్లో వరి సాగయిందన్నారు. 12వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేయగా ఇంతవరకూ 7,100 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మండలంలోని 15 రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసినట్టు వివరించారు. పీఎల్-1100 వంటి వరి వంగడాలు కోత కోయాల్సి ఉందన్నారు. రైతులు తమ ధాన్యాన్ని త్వరితగతిన మిల్లుకు తరలించే ఏర్పాటు చేయాలని సూచించారు. కాగా మొక్కజొన్న పంట కొనుగోలుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

నిడదవోలు రూరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని సోమవారం మండలంలోని తిమ్మరాజుపాలెం లయన్స్ వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. లయన్స్‌క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ సత్తి ఆదివిష్ణు ఆధ్వర్యంలో 25 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిడదవోలు సబ్ బ్రాంచ్ చైర్మన్ బండి వెంకటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ఎంట్రన్స్‌కు ముగిసిన ఉచిత శిక్షణ

ఉండ్రాజవరం: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఉండ్రాజవరంలోని బౌద్ధ ధమ్మ పీఠంలో ఇచ్చిన ఉచిత శిక్షణ సోమవారంతో ముగిసింది. ఈ పరిసర ప్రాంతాలకు చెందిన 126 మంది విద్యార్థినీవిద్యార్థులకు నెల రోజుల పాటు ఇక్కడ శిక్షణ పొందారు. ఆళ్ళ సుబ్బారావు ఆధ్వర్యంలో నిపుణులైన ఉపాధ్యాయులు వారికి తర్ఫీదు ఇచ్చారు. పీఠాధిపతి, బౌద్ధ భిక్షువు బంతె అనాలియో సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

పొగాకు విత్తనాలకు దరఖాస్తుల ఆహ్వానం

దేవరపల్లి: 2023-24 పంట కాలానికి అవసరమైన పొగాకు విత్తనాల కోసం పొగాకు బోర్డు క్షేత్రస్థాయి సిబ్బందిని కలిసి దరఖాస్తులు ఇవ్వాలని దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి జీఎల్‌కే ప్రసాద్ సోమవారం రైతులకు సూచించారు. సీటీఆర్ఐ ప్రతిపాదించిన నూతన పొగాకు వంగడాలను పొగాకు బోర్డు ద్వారా సరఫరా చేస్తున్నట్టు చెప్పారు. విత్తనాలను సీటీఆర్ఐ సంస్థ సరఫరా చేస్తుందన్నారు. దరఖాస్తు చేసుకున్న రైతులకు మాత్రమే విత్తనాలు సరఫరా చేయబడతాయన్నారు.

తపాలా జీవిత బీమా పాలసీల సేకరణకు ఏజెంట్ల ఎంపిక

దేవరపల్లి: ప్రజల నుంచి తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా పాలసీలు స్వీకరించేందుకు ఏజెంట్లను ఎంపిక చేస్తున్నట్టు తాడేపల్లిగూడెం పోస్టల్ సూపరింటెండెంట్ సీవీ రామిరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఇందు కోసం ఈ నెల 10 ఉదయం 11 గంటలకు తాడేపల్లిగూడెం పోస్టల్ డివిజన్ కార్యాలయం వద్ద ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.ఎంపికైన ఏజెంట్లకు పాలసీలపై కమీషన్ చెల్లిస్తామన్నారు. హాజరయ్యే అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులైన 18-50 సంవత్సరాల మధ్య వయసు వారై ఉండాలన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు తమ బయోడేటా, ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్, ఆధార్, పాన్ కార్డులు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకురావాలన్నారు.

పేదలకు బియ్యం బస్తాల పంపిణీ

కొవ్వూరు: మల్లిపూడి చారిటబుల్ ట్రస్టు ద్వారా పశివేదల గ్రామంలో 30 మంది పేదలకు సోమవారం బియ్య బస్తాలు పంపిణీ చేశారు. ఆ సంస్థ ప్రతినిధి మల్లిపూడి ధనరాజు స్థానిక నాయకుల చేతుల మీదుగా పేదలకు బియ్యం బస్తాలు అందజేశారు. ఏపీపీ కాకులపాటి వెంకట రమణ, నూతంగి ఉదయ్‌కుమార్, దున్నా రాంబాబు, గెద్దాడ శ్రీను, దాసరి రాయుడు, బీసీ నాయకులు జమ్ము లక్ష్మణరావు, బొడసింగు తులసి, అయినం సుబ్రహ్మణ్యం, మీసాల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేపు డీఎస్సీ- 1998 టీచర్ల భేటీ

కొవ్వూరు: డీఎస్సీ-1998 ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఉపాధ్యాయుల సమావేశాన్ని బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు తాడేపల్లిగూడెంలోని జెడ్పీ హైస్కూల్లో నిర్వహించనున్నట్టు అసోసియేషన్ నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్సీ -1998 ఉపాధ్యాయుల సమస్యలు, భవిష్యత్తు కార్యాచరణపై సమీక్షించనున్నట్లు తెలిపారు.సర్వసభ్య సంఘం ఏర్పాటు చేసేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

వడివడిగా ధాన్యం సేకరణ


దేవరపల్లి మండలం దుద్దుకూరులో రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం


దేవరపల్లి మండలం త్యాజంపూడిలో బస్తాల్లో నింపి మిల్లుకు తరలించడానికి సిద్ధంగా ఉన్న ధాన్యం

- నిబంధనలు సడలింపుతో ఊపిరి పీల్చుకున్న రైతులు
- స్థానిక మిల్లులకు ధాన్యం సరఫరా
- రోజుకు 1400 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- అన్నదాతలకు అండగా ప్రభుత్వం

దేవరపల్లి: అకాల వర్షాల వల్ల ఆందోళన చెందుతున్న రైతులకు ప్రభుత్వం అండగా నిలిచింది. రైతుల వద్ద గల రబీ ధాన్యాన్ని తక్షణం కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు ఇవ్వడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ధాన్యం కొనుగోళ్లు, మిల్లులకు తరలింపు వంటి అంశాల్లో నిబంధనలను ప్రభుత్వం సడలించడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. రోడ్లపైన, కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యన్ని వారు సంచుల్లో నింపి మిల్లులకు తరలిస్తున్నారు. గోనె సంచుల కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఎప్పటి ధాన్యాన్ని అప్పుడు మిల్లులకు తరలించే వెసులుబాటు కల్పించడంతో పాటు లోకల్ మిల్లుకు ట్యాగ్ అప్ చేయడంతో రైతులు ట్రాక్టర్లపై మిల్లులకు తరలిస్తున్నారు. అవసరమైతే ట్రాక్టర్లపై ధాన్యాన్ని రాశిగా పోసి నేరుగా మిల్లులకు తరలిస్తున్నారు. దీనితో సంచుల సమస్యకు తెర పడింది. నాలుగు రోజుల క్రితం వరకూ గోపాలపురం నియోజకవర్గంలోని దేవరపల్లి, నల్లజర్ల, గోపాలపురం మండలాల్లోని ధాన్యాన్ని అనపర్తిలోని 22 మిల్లులకు ట్యాగ్‌అప్ చేసి తరలించేవారు. అయితే మిల్లులకు వెళ్లిన లారీ అన్ లోడింగ్‌కు మూడు రోజుల సమయం పట్టేది. అంతేగాకుండా ముక్క శాతం ఎక్కువగా ఉందంటూ మిల్లర్లు రైతులను ఇబ్బంది పెట్టేవారు. క్వింటాల్‌కు ఆరు కిలోల ధాన్యాన్ని తగ్గించి దిగుమతి చేసుకునేవారు. తగ్గించిన ధాన్యానికి రైతు నుంచి అదనంగా లారీకి రూ.25 వేల చొప్పున చెల్లించాలంటూ ఇబ్బంది పెట్టేవారు. దీంతో రైతులు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావును కలిసి తమ సమస్యలను మొరపెట్టుకున్నారు. దీనికితోడు అకాల వర్షాలకు రోడ్లపైన, కళ్లాల్లోను ఆరబెట్టిన ధాన్యం తడవడం, కింది భాగంలోని తడిసి ధాన్యం మొలకలు రావడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ఈ పరిస్థితిలో అన్నదాతకు అండగా ఉండాలని ఎమ్మెల్యే తలారి అధికారులకు సూచించారు. మిల్లర్ల నుంచి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన జిల్లా జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ దృష్టికి తీసువెళ్లారు. జేసీ ఆదేశాల మేరకు అధికారులు ధాన్యం సేకరణను వేగవంతం చేశారు. ఈ క్రమంలో వారం రోజులుగా మూడు మండలాల్లో ధాన్యం సేరకణ వేగంగా జరుగుతోంది.

రోజుకు 1,400 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

రోజుకు నియోజకవర్గంలో సుమారు 1,400 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేసి మిల్లులకు తరలిస్తున్నారు. దేవరపల్లి మండలంలో 450 మెట్రిక్ టన్నులు, నల్లజర్ల మండలంలో 550 మెట్రిక్ టన్నులు, గోపాలపురం మండలంలో 400 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరుగుతోంది. రెండు రోజులుగా వాతావరణం అనుకూలించడంతో రోడ్లపై ధాన్యం ఆరబెట్టి బస్తాల్లో నింపి మిల్లులకు తరలిస్తున్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు



ధాన్యం రైతులు ఆందోళన చెందవద్దు. పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. ఇప్పటికే నిబంధనలు సడలించి ధాన్యాన్ని సేకరిస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు చేరింది. సకాలంలో రైతులకు సొమ్ములు ప్రభుత్వం చెల్లిస్తోంది. స్థానికంగా ఉన్న మిల్లులకు ధాన్యం పంపించవచ్చు. .

– తలారి వెంకట్రావు, ఎమ్మెల్యే, గోపాలపురం

మిల్లర్లు సహకరిస్తున్నారు



ధాన్యం సేకరణకు మిల్లర్లు సహకరిస్తున్నారు. నిబంధనలు సడలించడంతో ఎగుమతులు వేగంగా జరుగుతున్నాయి. దేవరపల్లి మండలం నుంచి రోజుకు 400 మెట్రిక్ టన్నుల (20 లారీలు) ధాన్యం మిల్లుకు పంపిస్తున్నాం. మొలక శాతం చాలా తక్కువగా ఉంది. మొలకలు వచ్చిన ధాన్యం ఆరబెట్టి రైతులు ఆర్‌బీకేల్లో అమ్ముకుంటున్నారు. 50 శాతానికి పైబడి సేకరణ జరిగింది. వారం రోజుల్లోగా సేకరణ పూర్తవుతుంది. కోయవలసిన పంట చేలల్లో ఉంది. తుపాను కారణంగా రైతులు భయపడుతున్నారు.

– కె.విజయ్, వ్యవసాయాధికారి, దేవరపల్లి మండలం

మండల ప్రత్యేకాధికారిగా ప్రతాప్



నల్లజర్ల: మండల ప్రత్యేకాధికారిగా మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ డి.ప్రతాప్ నియమితులయ్యారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తానని, మండలంలోని అధికారులంతా తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.

లోక్ అదాలత్‌లతో కేసుల సత్వర పరిష్కారం

నిడదవోలు: కేసుల సత్వర పరిష్కారానికి అన్ని కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునేలా కృషి చేయాలని మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ జి.రామకృష్ణ పోలీసులకు సూచించారు. పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సోమవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి పి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 13న నిర్వహించే మెగా లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నిడదవోలు సీఐ కె.వెంకటేశ్వరరావు, పట్టణ ఎస్సై పి.నాగరాజు, ఎస్ఈబీ అధికారులు పాల్గొన్నారు.

అలరించిన శక్తి రూపాల నృత్య ప్రదర్శన


కూచిపూడి నాట్యంలో భాగంగా శక్తి రూపాల ప్రదర్శన

పెరవలి: ఖండవల్లి గ్రామంలో పోలేరమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఆదివారం రాత్రి కూచిపూడి నాట్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. కళాకారిణులు ప్రదర్శించిన వివిధ రకాల శక్తి రూపాల నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అమ్మ వారి వేషధారణలో రాక్షసులను సంహరించే రూపకం కనువిందు చేసింది. ఖండవల్లి గ్రామానికే చెందిన కూచిపూడి నృత్య కళాకారిణి సాయిప్రియ ఆధ్వర్యంలో ఈ నృత్య రూపకాన్ని రూపొందించారు. పోలేరమ్మ వారిని పుట్టింటి నుంచి అత్తింటికి సాగనంపే ఊరేగింపులో గరగ నృత్యాలు, బ్యాండు మేళాలు సందడి చేశాయి.

అన్నదాతలకు అధికారులు అండగా ఉండాలి


అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి

ఉండ్రాజవరం: అధికారులు సమన్వయంతో పని చేస్తూ అకాల వర్షాల వల్ల ఇబ్బంది పడుతున్న రైతులకు అండగా నిలవాలని ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి సూచించారు. అకాల వర్షాల వల్ల సమస్యలు ఎదుర్కొంటున్న రైతులను ఆదుకునే విషయమై చర్చించేందుకు మండలస్థాయి అధికారులతో సోమవారం స్థానిక పరిషత్ కార్యాలయంలో ఆమె సమీక్ష జరిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల పనితీరు, నష్టపోయిన రైతుల గురించి మండల వ్యవసాయాధికారి ఎం.విశ్వాసరావును ఎంపీపీ యల్లారేశ్వరి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇలాంటి సమయంలో అలసత్వం వహించకుండా రైతులకు మేలు జరిగేలా చూడాలన్నారు. రైతు భరోసా, ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. మండలంలోని ప్రాధాన్యత భవనాల నిర్మాణాల పురోగతి గురించి మండల ఇంజినీరింగ్ అధికారులతో ఎంపీపీ సమీక్షించారు. అనంతరం పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలోని జెడ్పీ హైస్కూళ్లలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎ. శ్రీనివాసు, ఎంఈఓ పీవీఎస్ నాగరాజు, ఈఓపీఆర్డీ ముత్యం వీరాస్వామినాయుడు, టెక్నికల్ అసిస్టెంట్లు కాంతారావు, పాలాటి శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న కారును ఢీ కొట్టిన లారీ

నలుగురికి గాయాలు

కొవ్వూరు: ఆగి ఉన్న కారును గ్యాస్ ట్యాంకర్ ఢీ కొట్టిన ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. కొవ్వూరు పట్టణ శివార్లలోని గామన్ ఇండియా బ్రిడ్జి సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదంలో రాజమహేంద్రవరంలోని తాడితోట ప్రాంతానికి చెందిన ఎం.కుమారి, ఆమె భర్త రమేష్, చెల్లెలు దేవి, వారి తల్లి గాయపడ్డారు. వివాహానికి హాజరయ్యేందుకు కుమారి, ఆమె కుటుంబ సభ్యులు కారులో రాజమహేంద్రవరం నుంచి బయల్దేరారు. గామన్ ఇండియా బ్రిడ్జి సమీపంలోకి వచ్చేసరికి కారులో ఆయిల్ అయిపోయింది. దీంతో కారును రోడ్డు పక్కనే ఆపి ఆయిల్ కోసం వెళ్లారు. ఈ సమయంలో ట్యాంకర్ లారీ కారుని ఢీకొట్టడంతో కారులో ఉన్న నలుగురూ గాయపడ్డారు. వారిని రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామని కొవ్వూరు పట్టణ ఎస్సై బి.దుర్గా ప్రసాద్ తెలపారు.

సొసైటీల ద్వారా రైతులకు మెరుగైన సేవలు

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- ద్వారకాతిరుమలలో సొసైటీ పెట్రోల్ బంకు ప్రారంభం


వినియోగదారుడి వాహనంలో పెట్రోల్ కొడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల: జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సొసైటీల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందుతున్నాయని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. సుమారు రూ. 2 కోట్లతో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) అభివృద్ధి చేసిన ద్వారకాతిరుమల సొసైటీ పెట్రోల్ బంకును స్థానిక సొసైటీ చైర్మన్ గుర్రాల లక్ష్మణ్, పర్సన్‌లు చుక్కా నరసింహారావు, కనికెల్లి వరలక్ష్మితో కలసి ఎమ్మెల్యే తలారి సోమవారం ప్రారంభించారు. తొలుత ఆయన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎంపీపీ బొండాడ మోహిని, జెడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు తదితరులతో కలసి పెట్రోల్, డీజిల్ పంపులను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఆ తరువాత పలువురు వినియోగదారులకు ఎమ్మెల్యే స్వయంగా పెట్రోల్ కొట్టారు. కార్యక్రమంలో ఐఓసీ సీనియర్ మేనేజర్ పారుపల్లి సత్యారావు, డివిజినల్ మేనేజర్ కె.వెంకటేష్ మూర్తి, సేల్స్ ఆఫీసర్ కోరుపొల్లు సంజీవి, పలువురు సొసైటీల చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను బడిలో చేర్చే డ్రైవ్ ప్రారంభం


ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాసరావు

గోపాలపురం: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు విద్యా శాఖ ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందినట్టు ఎంఈఓ జి.శ్రీనివాసరావు చెప్పారు. దీనిపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలంలోని ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ సోమవారం నుంచి ఈ నెల 12 వరకూ డిప్యూటీ విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, సెక్టోరల్ అధికారులతో జిల్లా విద్యాశాఖాధికారుల సమీక్ష ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామాల్లోని బడిఈడు పిల్లల రిజిస్టర్లను సిద్ధం చేయాలని సూచించారు. 15వ తేదీ నుంచి 19 వరకూ గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించాలన్నారు. గ్రామ స్థాయిలో ఆయా పంచాయతీల ప్రజాప్రతినిధులతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. బడి మానేసిన బాల కార్మికులను గుర్తించి వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి, పిల్లలను బడిలో చేర్పించాలని సూచించారు.

రామాలయంలో అఖండ నామ సంకీర్తన

గోపాలపురం: ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని చెరుకుమిల్లి రామాలయం వద్ద అఖండ నామ సంకీర్తన ప్రారంభించారు. సోమవారం ఉదయం ప్రారంభమైన సప్తాహ అఖండ నామ సంకీర్తన ఈనెల 15 వరకూ కొనసాగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 15 న భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం, అన్నసమారాధన నిర్వహిస్తామని కమిటీ సభ్యులు చెప్పారు.



వేసవి సెలవుల్లో విజ్ఞానం పెంచుకోవాలి

- కొవ్వూరు మునిసిపల్ చైర్ పర్సన్ రత్నకుమారి
- గ్రంథాలయాల్లో చిన్నారుల సందడి
- వివిధ అంశాల్లో వారికి శిక్షణ ప్రారంభం


కొవ్వూరు సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్ పర్సన్ రత్నకుమారి


ముక్కామల గ్రంథాలయంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

కొవ్వూరు: వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి సూచించారు. స్థానిక గౌతమీ నగర్‌లోని గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో మానసిక వికాసాన్ని పెంచేలా యోగ, డ్యాన్స్, మ్యూజిక్, చెస్, క్యారమ్స్ వంటివి నేర్పించడం హర్షించదగిన విషయమన్నారు. కౌన్సిలర్లు తోట లక్ష్మీ ప్రసన్న, పిల్లలమర్రి మురళీకృష్ణ, సంస్కృత పాఠశాల హెచ్‌ఎం గోవర్ధనం శ్రీనివాస్, రిటైర్డు ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి సీవీ సుబ్రహ్మణ్యం, వాసవీ క్లబ్ అధ్యక్షుడు తీగెల రవికుమార్, గ్రంధి ప్రవీణ్, యోగా శిక్షకురాలు కె.వల్లీ, కనక దుర్గ, గ్రంథాలయ పాలకుడు జీవీవీఎస్ త్రినాథ్, ఎం.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాన్ని కౌన్సిలర్ కొత్తపల్లి సుప్రియ ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.భీమారావు, రిటైర్డ్ తెలుగు టీచర్ పొన్నా కృష్ణబాబు, గ్రంథాలయాధికారి కుంచే చినబాబు తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: నల్లజర్ల శాఖా గ్రంథాలయంలోఈ కార్యక్రమాన్ని ఆ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఆలపాటి సురేష్ ప్రారంభించారు.జగన్నాథ సాహితీ సమాఖ్య కార్యదర్శి కూచిభొట్ల సోమనాథ్ తొలిరోజు విద్యార్థులతో ముఖాముఖీ మాట్లాడారు. గ్రంథపాలకురాలు ఏవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

పెరవలి: విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలు మండలంలోని పెరవలి, ముక్కామల, తీపర్రు శాఖా గ్రంథాలయాల్లో సోమవారం ప్రారంభమయ్యాయి. ముక్కామల గ్రంథాలయంలో ఈ కార్యక్రమాన్ని ఆ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కడియాల సాయిరామారావు ప్రారంభించారు. ఇంగ్లిషు ఉపాధ్యాయుడు ఎ.పార్థసారథి తొలిరోజు ముక్కామల గ్రంథాలయంలో విద్యార్థులకు ఆంగ్ల భాషలోని ప్రాథమిక అంశాలను వివరించారు. ఆయా కార్యక్రమాల్లో ముక్కామల, తీపర్రు పంచాయతీ సర్పంచులు కేతా త్రిమూర్తులు, కోటిపల్లి శ్రీదేవి, ఎంపీటీసీ సభ్యులు గండేపల్లి రామకృష్ణ, కరుటూరి విశ్వనాథం, సలాది సూర్య నారాయణ, కోపెల్ల పట్టాభిరామారావు, పెరవలి, తీపర్రు, ముక్కామల గ్రంథాలయాధికారులు యు. వెంకటేశ్వర్లు, జయలక్ష్మి, వెంకటేశ్వర్లుపాల్గొన్నారు.

చాగల్లు: స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థుల వేసవి శిక్షణ తరగతులను ఆ పంచాయతీ ఉప సర్పంచ్ ముళ్లపూడి ఉదయ్‌భాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి గద్దె శ్రీనివాసరావు మాట్లాడుతూ 40 రోజుల పాటు ఈ తరగతులు నిర్వహిస్తామన్నారు. తొలిరోజు విద్యార్థులలో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యుడు సానబోయిన అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.అలాగే చంద్రవరం గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులను సర్పంచ్ మద్దిపాటి శ్రీరామమూర్తి ప్రారంభించారు. శిక్షణ తరగతుల పోస్టర్‌ను అవిష్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు బండి అశోక్‌బాబు, గ్రంథాలయాధికారి కె.సుమన్ పాల్గొన్నారు.

దేవరపల్లి: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి విజ్ఞాన శిబిరాన్ని దేవరపల్లి సర్పంచ్ వీరకుమారి ప్రారంభించారు. అలాగే యర్నగూడెం శాఖా గ్రంథాలయంలో ఆ లైబ్రరీ అభివృద్ధి కమిటీ చైర్మన్ ధూళిపూడి రవీంద్ర ప్రారంభించారు. గ్రంథాలయ అధికారి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ జూన్ 11 వరకు శిబిరాలు నిర్వహిస్తామన్నారు. రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిబిరం నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.కార్యక్రమాల్లో దేవరపల్లి ఎంపీటీసీ మాజీ సభ్యులు కడిమి రాజు, భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ పేరయ్యనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిడదవోలు డివిజన్
90102 34548 (కొవ్వూరు)
90100 51493 (నిడదవోలు)
90100 68395 (గోపాలపురం)
Office mail : tpgadvt@gmail.com